

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
బుధవారం 6 మార్చి 2024



అసైన్డ్ భూములపై సర్వహక్కులు కల్పించాలి

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 5 : అసైన్డ్ భూములపై సర్వహక్కులు కల్పించాలని అసైన్డ్ భూముల సర్వహక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శ్రీహరి అన్నారు. మంగళవారం ఆయన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాలకు చెందిన అసైన్డ్ రైతు కుటుంబాలు 16లక్షల వరకున్నాయని, రాష్ట్రంలో సుమారు 24 లక్షల ఎకరాలు అసైన్డ్ భూములు ఉన్నాయన్నారు. లావణి పట్టా డి-ఫారం పట్టా, త కేటి పట్టా, ఎర్రగీత పట్టా, సీలింగ్, పోరంబోకు భూములు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర వర్గాలకు చెందినవి ఉన్నట్లు చెప్పారు.



రోజురోజుకు ఎండలు తీవ్రమవుతున్నాయి. భానుడి భగభగలకు ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మండే ఎండల్లో పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే.. ఏప్రిల్, మేలో పరిస్థితి ఏంటని జనం భయపడుతున్నారు. ఉదయం 8 గంటలకే ఉక్కపోత మొదలవుతుంది. పగటి ఉష్ణోగ్రతలతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలూ పెరగడంతో ప్రజలు తట్టుకోలేక పోతున్నారు.

- మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు
- ఇబ్బంది పడుతున్న కూలీలు, రైతులు
- అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దంటున్న నిపుణులు
- రక్షణ చర్యలు తీసుకోవాలంటున్న వైద్యులు
- వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని సూచన
- ఏప్రిల్, మే నెలలో ఎండలు మరింతగా ఉండొచ్చంటున్న వాతావరణ శాఖ
- కూలర్లు, శీతల పానీయాలకు పెరుగుతున్న డిమాండ్

ఉమ్మడి జిల్లాలో నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు

తేది	రంగారెడ్డి	వికారాబాద్	మేడ్చల్
మార్చి 05	39.2	39.0	38.7
మార్చి 04	38.7	37.9	38.8
మార్చి 03	38.8	38.2	38.2
మార్చి 02	37.1	38.2	37.5
మార్చి 01	36.8	37.6	37.8
ఫిబ్రవరి29	37.3	37.8	37.9
ఫిబ్రవరి28	38.0	37.9	38.0

మార్చిలోనే మంటలు!

రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 5: ఉమ్మడి జిల్లాలో ఎండలు ముదురుతున్నాయి. మునుపెన్నడూ లేనంతగా మార్చి మొదటి వారంలోనే భానుడు భగ్గుమంటున్నాడు. వారం రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు జనం బెంబేలెత్తితున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతోంది. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం నాలుగు వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మధ్యాహ్నం వేళలో రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఉపాధి కూలీలు, కార్మికులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులకు వడదెబ్బకు గురవకుండా ఎక్కువనీటిని తాగుతూ మజ్జిగ, పండ్ల రసాలు వంటివి తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. గతేడాది కంటే ఈసారి ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఇళ్లలో ఉండేవారు ఏసీలు, కూలర్లు పెట్టుకుని ఉపశమనం పొందుతున్నారు. మరి కొంతమంది చెట్ల కింద సేద తీరుతున్నారు. మూగజీవాల విషయంలో మరింత జాగ్రత్త వహించాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. ఎండలో మేతకు తీసుకుపోకుండా చూడాలని, పశువుల పాక, కొట్టాల్లోనే నీటిని చల్లాలని, నీటితో తడిపిన తట్టు సంచులు వేయాలని జాగ్రత్తలు చెబుతున్నారు. మరోవైపు మండుతున్న ఎండలకు పొలాలు తడారిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

39.2. డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత

వాస్తవానికి ఏప్రిల్, మేలో ఎండల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ సారి ఫిబ్రవరి చివరి, మార్చి మొదటి వారంలోనే ఉష్ణోగ్రతలు 39 డిగ్రీలు దాటి పోయింది. మార్చి మొదటి వారంలోనే ఎండ తీవ్రత ఇలా ఉంటే.. ఇక ఏప్రిల్, మేనే నెలలో భానుడి ప్రతాపం ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లి గ్రామంలో అత్యధికంగా 39.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా యాలాల మండలంలో 39.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం అలియాబాద్‌లో 38.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

కూలర్లు, ఏసీలు, శీతల పానియాలకు పెరిగిన డిమాండ్

ఎండలు ముదరడంతో కూలర్లు, ఫ్రిజ్‌లు, ఏసీలు, శీతల పానీయాలకు డిమాండ్ పెరిగింది. తక్కువ విద్యుత్ వినియోగించే ఏసీలు, కూలర్లపై వినియోగదారులు మక్కువ చూపుతున్నారు. కరెంటు లేకున్నా ఇన్‌వర్టర్, బ్యాటరీలతో పనిచేసే వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఎండ వేడిమికి ఉపశమనం కోసం శీతల పానీయాలపై జనాలు ఆసక్తి చూపడంతో జ్యూస్, ఐస్‌క్రీమ్, ఫ్రూట్ సలాడ్ వంటి వాటికి డిమాండ్ పెరిగింది.

తీవ్రంకానున్న వడగాలులు

రాబోయే రోజుల్లో వడగాలుల ప్రభావం అధికంగా ఉండే అవకాశాలున్నాయంటున్నారు వాతావరణ నిపుణులు. ఈసారి ఎండల తీవ్రత పంటలపై కూడా ప్రభావం చూపనుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు వేసవి కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నారు.





నిర్లక్ష్యం చేయొద్దు

ఎండ తీవ్రత ఉన్నప్పుడు బయటకు వెళ్లకపోవడమే మంచింది. ఏ మాత్రం అసౌకర్యంగా ఉన్నా నిర్లక్ష్యం చేయకుండా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స పొందాలి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, కార్మికులు, క్రీడాకారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతీ ఒక్కరు నీటిని ఎక్కువగా తీసుకోవాలి. కూల్‌డ్రింక్స్‌కు బదులుగా మజ్జిగ, పండ్ల రసాలు తాగడం మంచిది. వేసవిలో ఉపశమనం కోసం కర్బూజ, దోస కాయలు, ఇతర పండ్లు తీసుకోవాలి. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే కూలింగ్ గ్లాసెస్, హెల్మెట్, గ్లౌజ్‌లు, గొడుగు వంటివి వెంట తీసుకెళ్లాలి.

వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి

బీఆర్ఎస్ నాయకులను ఎలా చేర్చుకుంటారు?

- నేతల ముందు కాంగ్రెస్ శ్రేణుల ధ్వజం
- కుర్చీలు విరగ్గొట్టి నిరసన
- పెట్రోల్ పోసుకునేందుకు కార్యకర్త యత్నం
- సముదాయించిన మాజీ ఎమ్మెల్యే



ఆందోళనకారులకు నచ్చజెబుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

కొత్తూర్, మార్చి 5: 'కాంగ్రెస్ పార్టీకి ఏళ్లుగా సేవ చేస్తూ, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో షాద్‌నగర్‌లో వీర్లపల్లి శంకర్ గెలుపు కోసం రాత్రింబవళ్లు కృషి చేశాం. మాకు సమాచారం ఇవ్వకుండా కొందరు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ కార్యకర్తలను కాంగ్రెస్‌లో చేర్పించేందుకు సిద్ధమయ్యారు.' అని కాంగ్రెస్ నాయకులు ఆందోళనకు దిగి కుర్చీలు విరగ్గొట్టి నిరసన వ్యక్తం చేశారు. ఓ కార్యకర్త ఒంటిపై పెట్రోల్ పోసుకునేందుకు యత్నించాడు. ఈ ఘటన మంగళవారం కొత్తూరు మండలంలో చోటుచేసుకుంది. ఇన్ముల్‌నర్వ, మల్లాపూర్, గుడూరు, కొడిచర్ల గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కాంగ్రెస్ నాయకులు ఇటీవల చర్చలు జరిపి పార్టీలోకి ఆహ్వానించారు. కొత్తూరులోని కాంగ్రెస్ కార్యాలయంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరే కార్యక్రమానికి రంగం సిద్ధం చేశారు. అయితే, కొన్ని అనివార్య ఈ కార్యక్రమానికి కారణాలతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరు కాలేదు. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్న విషయం తెలుసుకున్న పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. తమకు సమాచారం ఇవ్వకుండా బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లో ఎలా చేర్చుకుంటారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల నాయకులను నిలదీశారు. హాలులో ఉన్న కుర్చీలను విరగ్గొట్టారు. ఓ కార్యకర్త ఆవేశంతో ఒంటిపై పెట్రోల్ పోసుకునేందుకు యత్నించగా అక్కడున్న వారు అడ్డుకున్నారు. పార్టీకి ఎంతో సేవ చేస్తున్న తమను కాదని బీఆర్ఎస్‌లోని వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని, ఏళ్లుగా ఎన్నో బాధలు అనుభవించి నియోజకవర్గంలో పార్టీని గెలిపిస్తే తమకు ఇచ్చే గౌరవం ఇదేనా? అని మండల నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఎం.శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, జె.గోవర్ధన్‌గౌడ్, జె.సుదర్శన్‌గౌడ్, రవికుమార్‌గుప్తా, శ్రీను తదితరులు ఆందోళనకారులకు సర్దిచెప్పి పంపించేశారు. బీఆర్ఎస్ నుంచి చేరికలను వాయిదా వేస్తున్నట్లు నాయకులు ప్రకటించారు.

సీహెచ్‌సీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్య

ఆసుపత్రి సూపరింటెండెంట్, ఎస్సైల వేధింపుల వల్లేనని సెల్ఫీ వీడియో, సూసైడ్ నోట్



జయంత్ రాసిన సూసైడ్ నోట్



జయంత్(ఫైల్)

ఇబ్రహీంపట్నం, మార్చి 5: ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి జయంత్(24) మంగళవారం మధ్యాహ్నం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డా.రఘునాథ్, ఎస్సై షైబెల్లి వేధింపుల వల్లే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని సూసైడ్ నోట్ రాసి, సెల్ఫీ వీడియో తీసి ఇబ్రహీంపట్నం సమీపంలోని బైపాస్ రోడ్డు పక్కన చెట్టుకు ఉరేసుకున్నాడు. సీఎం రేవంత్‌రెడ్డి వీరిని శిక్షించాలని సూసైడ్ నోట్‌లో కోరాడు. ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీలో అటెండర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ కుమారుడు జయంత్(24) కొంతకాలంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా ఇదే ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. అతడు తరచూ మద్యం తాగి సిబ్బందిని బెదిరించేవాడని ఆసుపత్రి సిబ్బంది, పోలీసులు తెలిపారు. గత నెల 28న ఆసుపత్రి పక్క బస్తీలో ఉండే అశోక్‌పై జయంత్ చేయి చేసుకోవడంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విధులు సక్రమంగా నిర్వహించకపోవడమేగాక తరచూ గొడవలకు దిగుతున్న జయంత్‌ను మందలించిన ఆసుపత్రి సూపరింటెండెంట్ రఘునాథ్‌ను కత్తితో బెదిరించినట్లు తెలిపారు. దీంతో రఘునాథ్ అతడిపై ఈ నెల 2న పోలీసులకు ఫిర్యాదు చేసి విధులనుంచి తొలగించారు. పోలీసులు జయంత్‌ను అరెస్టు చేసేందుకు సిద్ధమయ్యారు. అంతలోనే అతడు సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్య చేసుకోవడం చర్చనీయాంశమైంది. జయంత్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



ధర్నా చేస్తున్న రైతులు

పాల బిల్లుల కోసం రైతుల ధర్నా

కొందుర్గు, మార్చి, 5: పాల బిల్లులు చెల్లించాలంటూ రైతులు మండల కేంద్రంలోని విజయ పాలశీతలీకరణ కేంద్రం వద్ద మంగళవారం ధర్నా చేశారు. మండల కేంద్రంలోని విజయ పాలశీతలీకరణ కేంద్రానికి కొందుర్గు, జిల్లేడ్-చౌదరిగూడ మండలాల్లోని వివిధ గ్రామాల్లో 50 పాల కేంద్రాల నుంచి ప్రతీ రోజు 8వేల లీటర్ల పాలను సేకరిస్తారు. ప్రైవేట్ పాల కేంద్రాల వారు లీటరుకు 32 రూపాయలు రైతులకు చెల్లిస్తున్నారు. విజయ పాల కేంద్రం మాత్రం లీటరుకు 40రూపాయలు ఇస్తుంది. దీంతో ఎక్కువ మంది రైతులు ప్రభుత్వ విజయ పాల కేంద్రాలకు పాలను పోస్తున్నారు. రెండు మండలాల్లో 1500 మంది రైతులు తమ పాలను విజయ పాల కేంద్రానికి పోస్తుంటారు. అయితే, విజయ పాలకేంద్రం మూడు వారాలుగా బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం జరిగింది. దీంతో రైతులు మంగళవారం ఉదయం మండల కేంద్రంలోని పాల కేంద్రం వద్ద ధర్నాకు దిగారు. పశువులకు దాణ తేవడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పాల బిల్లులను చెల్లించకపోతే పాల కేంద్రాలను మూసివేయాల్సి వస్తుందని విజయ పాలను సేకరిస్తున్న వివిధ గ్రామాల పాల సంఘం అధ్యక్షులు తెలిపారు. త్వరలోనే పాల బిల్లులు వస్తాయని పాల శీతలకరణ కేంద్రం మేనేజర్ చెప్పడంతో రైతులు ధర్నాను విరమించారు.

సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న అనూజ్ రంజన్

ఇబ్రహీంపట్నం, మార్చి 5: సైబర్ క్రైం అనేది కంప్యూటర్ ఆధారిత నేరం అని, ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ జనరల్ మేనేజర్ అనూజ్ రంజన్ అన్నారు. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ విద్యాసంస్థల్లో ఆర్బీఐ ద్వారా డిజిటల్ ట్రాన్సాక్షన్స్, సైబర్ ఫ్రాడ్స్, ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ అనే అంశంపై మంగళవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. అక్రమంగా డబ్బు సంపాదనకు సైబర్ నేరగాళ్లు, హ్యాకర్లు ఇటాంటి నేరాలకు పాల్పడున్నారన్నారు. ప్రపంచ దేశాలు సైతం ఇలాంటి సైబర్ నేరాలబారిన పడుతూ విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, ఆయా దేశాల్లో సైబర్ ఫ్రాడ్‌కు కఠిన శిక్షలున్నాయని ఆయన తెలిపారు. ఎలక్ట్రానిక్ రూపంలో ఉన్న సమాచారాన్ని దొంగిలించడం, ఈ-మెయిల్ బాంబింగ్, సలామి ఎటాక్, సర్వీస్ అటాక్‌ను అడ్డుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.వెంకట్రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీనాథరెడ్డి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.పార్థసారథి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఓటు నమోదును పెంచాలి

- జిల్లా కలెక్టర్ శశాంక

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్) : ఓటరు నమోదు శాతం పెంచేలా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం రాష్ట్ర ఎస్‌వీఈఈపీ కన్సల్టెంట్ శ్రీ భవానీ శంకర్ జిల్లాను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన కేంద్రాల్లో వయోజనులు ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ శ్రీలత, డీఈవో సుశీందర్ రావు, జిల్లా సంక్షేమాధికారి పద్మజ రమణ, ఎన్నికల సూపరింటెండెంట్ సైదులు పాల్గొన్నారు.

- లోక్‌సభ ఎన్నికల ముందు ఏర్పడిన ప్రాధాన్యత
- రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన అంశం
- త్వరలో గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పనున్నట్లు ప్రచారం?
- ఏసీడీపీ, ప్రత్యేక నిధుల కోసమే సీఎంను కలిశాను
- రాజకీయం కోణం ఏమీలేదు : చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



రేవంత్‌రెడ్డికి శాలువ కప్పుతున్న బీఆర్ఎస్ చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

బీఆర్ఎస్‌కు ఝలక్!

సీఎంతో చేవెళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే భేటీ, నెలకొన్న ఆసక్తి

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 5 : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఒక్కొక్కరు జారుకుంటూ కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారు. రోజు రోజుకి కాంగ్రెస్ పార్టీలోకి భారీగా వలసలు సాగుతున్నాయి. ఎన్నికల వేళ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. తాజాగా చేవెళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం 2009లో ఎస్సీలకు రిజర్వు అయ్యింది. ఎస్సీ రిజర్వుడ్ తర్వాత కాలె యాదయ్యకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం దక్కింది. నాడు కాంగ్రెస్ పార్టీ తరపున యాదయ్య పోటీ చేసి టీడీపీ అభ్యర్థి కేఎస్ రత్నంపై ఓటమి చెందారు. ఇక తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి కాలె యాదయ్య మరోసారి పోటీ చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి కేఎస్ రత్నంపై విజయం సాధించారు. అయితే, కొన్నాళ్లకే ఆయన అభివృద్ధి పేరిట బీఆర్ఎస్‌లో చేరారు. 2018లో జరిగిన ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కేఎస్ రత్నంపై ఘన విజయం సాధించారు. వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన యాదయ్య మూడోసారి 2023లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పామెన భీమ్‌భరత్‌పై స్వల్ప(268) మెజారిటీతో విజయం సాధించారు.

వరుసగా సీఎంను కలుస్తున్న నేతలు

వరుసగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తుండటంతో వారంతా పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారనే సంకేతాలు వినిపిస్తున్నాయి. ఇటీవలే ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఆయన కోడలు రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ నేపథ్యంలోనే చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య సీఎం రేవంత్‌రెడ్డిని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలవడంపై రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల చాలామంది బీఆర్ఎస్ నాయకులు పార్టీని వీడుతున్న క్రమంలో యాదయ్య కూడా గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పనున్నట్లు ప్రచారం ఊపందుకుంది. ఈ విషయంలో యాదయ్య ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తాను సీఎంను కలిసిన విషయం నిజమేనని, ఏసీడీపీ, ప్రత్యేక నిధుల కోసం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని, ఇందులో రాజకీయ కోణం ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు.

రేపు కార్యకర్తల సమావేశం

తాండూరు, మార్చి 5 : తాండూరు నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం గురువారం గోదాల ప్రతాప్‌రెడ్డి గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆలయ అభివృద్ధికి చర్యలు



మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కొడంగల్, మార్చి 5: పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి పునాదులు పడనున్నాయి. ఇటీవల కొడంగల్ పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి రూ.16 కోట్ల 50లక్షలు నిధులు మంజూరు చేసి నట్లు తెలిపారు. అందులో భాగంగా మంగళవారం దేవాదాయ శాఖ అధికారులు మల్లికార్జున్‌రెడ్డి, ఓంప్రకాశ్, తులసిరామ్, గణేశ్, శ్యామ్‌సుందర్ తదితరులు పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు శ్రీనివాస్‌గుప్త, రత్నం, రాజు తదితరులు ఉన్నారు.

కార్మికులు ఓబీసీడీబ్ల్యూ కార్డు పొందాలి



ఓబీసీడీబ్ల్యూ కార్డులను అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

తాండూరురూరల్, మార్చి 5: భవన నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు తప్పనిసరిగా ఓబీసీడబ్ల్యూ కార్డు పొందాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు పటేల్ నరేందర్‌రెడ్డి(సాయిరెడ్డి) కోరారు. మండలంలోని గౌతాపూర్‌లో మంగళవారం భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డు ద్వారా జారీ చేసిన గుర్తింపు కార్డులను అందజేశారు. భవన నిర్మాణ కార్మికులు ఓబీసీడబ్ల్యూ కార్డు ద్వారా వివాహానికి రూ.30వేల ఆర్థిక సాయం, ప్రసూతి ప్రయోజనం, ప్రమాదవశాత్తు మరణం, సహజ మరణం, అంత్యక్రియల ఖర్చు వంటివి పొందేందుకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. ఈ కార్డు పొందేందుకు 18-55ఏళ్ల వయస్సు గల భవన నిర్మాణ కార్మికులు దరఖాస్తు చేసుకుంటే తెలంగాణ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా పొందే అవకాశం ఉందన్నారు.

అర్హులకు లబ్ధి చేకూర్చాలి

మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ మార్చి 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ప్రజాపాలనలో భాగంగా గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల ఆన్‌లైన్ ప్రక్రియలో ఏవైనా లోపాలుంటే వాటిని సవరించి అర్హులకు లబ్ధి చేకూర్చాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాల సాఫ్ట్‌వేర్‌పై విద్యుత్‌శాఖ కార్యదర్శి రిజ్వి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేసి అర్హులకు లబ్ధి చేకూర్చాలని మున్సిపల్ కమిషనర్లు, ఎండీవోలను ఆదేశించారు. ఇది వరకే ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రాల వద్దనే ఈ ప్రక్రియను కొనసాగించాలన్నారు. ఆన్‌లైన్‌లో అభ్యర్థి ఆధార్ నంబర్, కరెంటు బిల్లు, యుఎస్‌సీ నంబర్, గ్యాస్ కనెక్షన్, కస్టర్ ఐడీ, కన్స్యూమర్ ఐడీలను క్రాస్ చెక్ చేసి రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. దరఖాస్తుదారులు అధిక సంఖ్యలో ఉన్న చోట తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేయాలన్నారు. బోడుప్పల్, నిజాంపేట, జవహర్‌నగర్‌లలో అధిక సంఖ్యలో దరఖాస్తుదారులు ఉంటారని అవసరమైతే 2 లేదా 3 కంప్యూటర్లను, ఆపరేటర్లను అందుబాటులో ఉంచాలన్నారు. రద్దీగా ఉన్న చోట ఎండీవోలు, మున్సిపల్ కమిషనర్లు దగ్గరుండి పరిశీలించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అభిషేక్‌అగస్త్యా పాల్గొన్నారు.

మల్లారెడ్డి యూనివర్సిటీ హాస్టల్‌లో
పురుగుల అన్నం లొల్లి



నిరసన చేపడుతున్న మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

మరోసారి అన్నం, స్వీట్, టిఫిన్‌లో పురుగులు రావడంతో విద్యార్థుల నిరసన

విద్యార్థుల ఆరోగ్యాలతో చెలగాటం : విద్యార్థి సంఘాలు


మేడ్చల్‌టౌన్, మార్చి 5 : అన్నంలో పురుగు వస్తున్నాయంటూ మల్లారెడ్డి యూనివర్సిటీ హాస్టల్ విద్యార్థులు మంగళవారం మరోసారి నిరసనకు దిగారు. విద్యార్థుల వద్ద నుంచి డబ్బులు దండు కోవటమే ధ్యేయంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. కొద్ది రోజుల కిత్రం మల్లారెడ్డి యూనివర్సిటీ హాస్టల్ అన్నంలో పురుగులు వస్తున్నాయంటూ విద్యార్థులు ఆందోళ చేసిన విషయం విదితమే. కాగా యూనివర్సిటీ హాస్టల్ నిర్వాహకులు నాణ్యమైన భోజనవసతులు కల్పిస్తామని విద్యార్థులకు కచ్చితమైన హామీ ఇవ్వటంతో అప్పట్లో విద్యార్థులు ఆందోళన విరమించారు. కాగా సోమవారం రాత్రి అన్నంతో పాటు పెట్టిన స్వీటులో పురుగులు దర్శనమిచ్చాయి. దీంతో బాలికల హాస్టల్ విద్యార్థినులు హాస్టల్ నిర్వాహకులను నిలదీశారు. అన్నం తినకుండా భీష్మించడంతో నిర్వాహకులు విద్యార్థినులను సముదాయించటంతో నిరసన వీడారు. తిరిగి మంగళవారం ఉదయం టిఫిన్ చేసేటప్పుడు మళ్లీ తిరిగి పురుగులు కనబడటంతో అన్న బహిష్కరణ చేసి నిరసన చేపట్టారు. విద్యార్థుల నుంచి డబ్బులు దండుకుంటూ అన్నం సరిగా పెట్టటం లేదని క్యాంటీన్ నిర్వాహకులను నిలదీశారు. విద్యార్థుల ఆందోళన విషయం తెలుసుకున్న పలు విద్యార్థి సంఘాల నాయకులు మల్లారెడ్డి యూనివర్సిటీ గేటు ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న యూనివర్సిటీ ప్రముఖులు విద్యార్థి సంఘాలు, హాస్టల్ విద్యార్థినులతో చర్చలు జరిపారు. పొరపాట్లను సరిదిద్దుతామని, హాస్టల్ నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హాస్టల్‌లో వండే అన్నం విషయంలో నాణ్యతతో పాటు శుభ్రత పాటించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో విద్యార్థులు శాంతించారు.

విద్యార్థుల ఆరోగ్యాలతో చెలగాటం

మల్లారెడ్డి యూనివర్సిటీ హాస్టల్‌లో విద్యార్థులకు పెడుతున్న భోజనంలో పురుగులు రావటం శరమామూలుగా మారిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.కార్తీక్, సంతోష్ రాథోడ్ ఆరోపించారు. అన్నంలో పురుగులు వస్తే వార్డెన్‌ను చూపెడితే పురుగులు పక్కన పెట్టి అన్నం తినమని ఉల్టా దబాయిస్తున్నారని ఆరోపించారు. అన్నంలో పురుగులు వస్తున్న వ్యవహారంలో విద్యార్థులు నోరు విప్పకుండా క్యాంటిన్ నిర్వాహకులు విద్యార్థులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. యూనివర్సిటీలో చదివే విద్యార్థుల భవిష్యత్ యూనివర్సిటీ నిర్వాహకులపై ఆధారపడి ఉండటంతో చాలా మంది విద్యార్థులు పురుగుల అన్నం విషయాన్ని బయటకు చెప్పడానికి భయపడుతున్నారని తెలిపారు. మల్లారెడ్డి యూనివర్సిటీలో హాస్టల్‌ను ప్రభుత్వ అధికారులు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. ధనార్జనయమే ధ్యేయంగా విద్యాసంస్థలు నడుపుతున్న యూనివర్సిటీపై ఎస్ఎఫ్ఐ ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి

డీఎల్‌పీవో శంకర్‌నాయక్



బషీరాబాద్ పంచాయతీలో ఇంటి టాక్స్‌ల వసూళ్లపై సమీక్షిస్తున్న డీఎల్‌పీవో శంకర్‌నాయక్

బషీరాబాద్, మార్చి 5: ఇంటి పన్ను వసూళ్లపై గ్రామ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని తాండూరు డివిజన్ డీఎల్‌పీవో శంకర్‌నాయక్ అన్నారు. బషీరాబాద్ ఎంపీడీవో కార్యాలయాన్ని మంగళవారం సందర్శించిన ఆయన పలు రికార్డులను పరిశీలించారు. ఇళ్ల టాక్స్‌ల వసూళ్లకు సంబంధించి సమీక్షిస్తూ అక్కడున్న ఎంపీవో రమేష్‌తో ఆరాతీశారు. అనంతరం ఆయన విలేకర్లతో మట్లాడుతూ బషీరాబాద్ మండల వ్యాప్తంగా 36 పంచాయతీలకు గానూ రూ.30లక్షల 42వేల 894 ఇంటి పన్ను వసూళ్ల లక్ష్యం కాగా నేటి వరకు రూ18లక్షల 82వేల 382 వసూళ్లు చేసినట్లు వెల్లడించారు. డివిజన్ పరిధిలోని తాండూరులో 33 పంచాయతీల్లో రూ.99లక్షల 91వేల 766 వసూళ్ల లక్ష్యం కాగా రూ.59లక్షల 58వేల 038, యాలాల మండలంలో 37 పంచాయతీల్లో రూ.57లక్షల 6వేల 41 వసూళ్ల లక్ష్యం కాగా రూ.29లక్షల 8వేల 95, పెద్దేముల్‌లో 37 పంచాయతీల్లో రూ.43లక్షల 29వేల 492 టాక్స్ వసూళ్లకు గాను రూ.26క్షల 36వేల 419, కొడంగల్ మండలంలో 26 పంచాయతీల్లో రూ.32లక్షల 52వేల 538 టాక్స్ వసూళ్లకు గాను రూ.23లక్షల 55వేల 176, బొంరాస్‌పెట్ మండలంలో 47 పంచాయతీల్లో రూ.30లక్షల 87వేల 147 పన్ను వసూళ్లకు గాను రూ.17లక్షల 22వేల 936, దౌల్తాబాద్‌లో 33 పంచాయతీల్లో రూ.33లక్షల 12వేల 116 టాక్స్ వసూళ్లకు రూ.19లక్షల 22వేల 996 వసూళ్లు జరిగినట్లు ఆయన వివరించారు. మార్చి 31లోపు టాక్స్ వసూళ్ల లక్ష్యం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ధరణి సమస్యల పరిష్కారానికి
చర్యలు తీసుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

బొంరాస్‌పేట్, మార్చి 5: ధరణిలో రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వెంటనే పరిష్కరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. రైతుల నుంచి వచ్చే దరఖాస్తులను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ రికార్డులను, కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ రవి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

కొడంగల్, మార్చి 5: రాబోయే పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగేందుకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలు కాగానే అన్నివర్గాల ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం ధరణిలో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటరు లిస్టు నమోదు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



డీఎల్‌పీవోకు వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

పంచాయతీ కార్మికుల
వేతనాలు వెంటనే చెల్లించాలి

బషీరాబాద్, మార్చి 5: పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, బుగ్గప్ప డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బషీరాబాద్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వేతనాలతో పాటు దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కారించాలన్నారు. పంచాయతీల్లో వివిధ కేటాగిరిల్లో పని చేస్తున్న కార్మికులకు ప్రతీనెల చెల్లించాల్సిన వేతనం 5 నెలల నుంచి 8 నెలలుగా పెండింగ్ ఉండటంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.26వేలు వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అక్కడున్న డీఎల్‌పీవో శంకర్‌నాయక్‌కు కార్మికులు వినతిపత్రం అందజేశారు. కార్మిక నాయకులు శ్యామప్ప, అనంతయ్య, చందు, లక్ష్మి, యాదమ్మ, బుజ్జి, జగమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతులను చేయడమే ధ్యేయం



శ్రీనివాస్‌రెడ్డిని అభినందిస్తున్న పురుషోత్తంరెడ్డి, సాత్వికరెడ్డి

మొయినాబాద్ రూరల్, మార్చి 5: విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చాలన్నదే తమ యూనివర్సిటీ లక్ష్యం అని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వీసీ పురుషోత్తంరెడ్డి అన్నారు. కళాశాల విద్యార్థి శ్రీనివాస్‌రెడ్డి రసాయన శాస్త్రంలో 'ట్రయజోల్ ఫార్మకోఫోర్ అండ్ డైయ్యర్ యాంటీ కేన్సర్ ఎవాల్యుయేషన్' అంశంపై ప్రొఫెసర్ సతీష్‌కుమార్ పర్యవేక్షణలో పరిశోధన చేసి డాక్టరేట్ సాధించాడు. అతడిని వీసీ పురుషోత్తంరెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డి మంగళవారం అభినందించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతస్థాయిలో స్థిరపడాలనేదే తమ యూనివర్సిటీ లక్ష్యం అన్నారు. తమ వర్సిటీ పరిశోధకులకు చక్కటి వేదికన్నారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు దామోదర్, రిజిస్ట్రార్ రవీందర్, డీన్ రాజు, సుందర్, కవిత, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



అయినాపూర్‌లో బురుజు స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సంధ్యారాణి

గ్రామకంఠం భూమి పరిశీలన

దోమ, మార్చి 5: గ్రామ కంఠం భూమిలో ఇంటి నిర్మాణంపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించనున్నట్లు డీఎల్‌పీవో సంధ్యారాణి అన్నారు. మండలంలోని అయినాపూర్ గ్రామంలో బురుజు నేలమట్టం, గ్రామ కంఠం భూమిలో ఇంటి నిర్మాణంపై కలెక్టర్ ఆదేశాల మేరకు ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బురుజు నేల మట్టం, ఇంటి నిర్మాణంపై భూమికి, ఇంటికి సంబంధించిన ఎలాంటి పత్రాలు ఉన్నా ఇరువర్గాల వారు పంచాయతీ కార్యదర్శికి అందించాలన్నారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదికలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి హరీశ్వర్‌రెడ్డి, గ్రామస్తులు, మాజీ సర్పంచ్ మున్నయ్య, గోవర్ధన్, బాబయ్య, రాములు, జనార్దన్‌గౌడ్, రవిగౌడ్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.



దస్త్రాలను పరిశీలిస్తున్న డీపీవో మోహన్ సురేష్

పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన డీపీవో

మొయినాబాద్ రూరల్, మార్చి 5 : హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి మోహన్‌సురేష్ తనిఖీ చేశారు. గ్రామంలోని డంపింగ్ యార్డును పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి యార్డుల్లోకి తరలించడంలో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని గుర్తించి కార్యదర్శిపై మండిపడ్డారు. డీపీవో పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. పన్నుల వసూళ్లు, పారిశుధ్య పనులపై పీఎస్ సంధ్యను వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఆయన వెంట ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.



రాములు, భరత్‌ప్రసాద్‌లకు ఘన స్వాగతం

ఆమనగల్లు, మార్చి 5: నాగర్‌కర్నూల్ ఎంపీ పి.రాములు, నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌లకు మంగళవారం శంషాబాద్ ఎయిర్ పోర్టులో బీజేపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. బీజేపీలో చేరి హైదరాబాద్ వచ్చిన రాములు, అభ్యర్థిత్వం ఖరారైన భరత్‌ప్రసాద్‌లకు నాయకులు పూలమాలలు వేసి సత్కరించారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని రాములు, భరత్ ప్రసాద్ పిలుపునిచ్చారు. కాగా రాములు, భరత్‌ప్రసాద్ ప్రధాన మంత్రి నరేంద్రమోదీని నగరంలోని బేగంపేట ఎయిర్‌పోర్టులో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర పర్యటకు వచ్చిన సందర్భంగా మోదీని కలిసినట్టు వారు పేర్కొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న డీఆర్డీవో పీడీ శ్రీనివాస్

దివ్యాంగులు స్వయం ఉపాధితో ఎదగాలి

డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్

తాండూరురూరల్, మార్చి 5: దివ్యాంగులంతా స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్ అన్నారు. తాండూరులోని ఐకేపీ స్త్రీ శక్తి భవన్‌లో మంగళవారం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, సిబ్బి ఆధ్వర్యంలో దివ్యాంగులకు రెండురోజుల శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా డీఆర్‌డీవో పీడీ ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న దివ్యాంగులను గుర్తించి అర్హులైన 37మందికి రూ.25వేల ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడ్బి ప్రతినిధి రామకృష్ణ, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీలక్ష్మి, పీఎస్ శ్రీనివాస్, ఉదయ్, కో-ఆర్డినేటర్ రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్ పార్టీ



మంత్రిని కలిసిన శంకర్‌పల్లి నాయకులు

శంకర్‌పల్లి, మార్చి 5: పార్టీ కోసం కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకు కాంగ్రెస్ అండగా ఉంటుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు కె.శ్రీకాంత్ సచివాలయంలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. వారితో ఆమె మాట్లడుతూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో యువత క్రియాశీలకంగా పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో మల్లేష్, బాబ ఉన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు
లక్ష్మీవేంకటేశ్వరాలయం ముస్తాబు



చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వరాలయం

చేవెళ్ల, మార్చి 5: ఈ నెల 8న మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే ఉత్సవాలకు చేవెళ్లలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరాలయం ముస్తాబైంది. 8 నుంచి 14వ తేదీ వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ మేనేజర్(ఈవో) నరేందర్, ధర్మకర్తలు శ్రీకాంత్‌చారి, శ్రీపాద్ తెలిపారు. 14వ తేదీన రథోత్సవంతో కార్యక్రమాలు పూర్తవుతాయని, భక్తులు తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. 600సంవత్సరాల క్రితం ఏర్పడిన ఈ ఆలయంలో ఉత్సవాలకు ఎంతో ప్రాశస్త్యం ఉందని అర్చకులు పేర్కొన్నారు.

మహేశ్వరాన్ని కాంగ్రెస్ కంచుకోటగా తయారుచేద్దాం



పోరండ్లలో కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

మహేశ్వరం, మార్చి 5: మహేశ్వరం నియోజకవర్గాన్ని కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా తయారు చేద్దామని, ఇక్కడి బీఆర్ఎస్‌ను ఖాళీ చేద్దామని, ఇందుకు కార్యకర్తల కష్టసుఖాల్లో తమ వంతు సహకారం ఉంటుందని రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ డాక్టర్ అనితాహరినాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మహేశ్వరం పోరండ్లలో కాంగ్రెస్ నాయకులతో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పేదలకు చేర్చేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కష్టపడే కార్యకర్తలను పార్టీ మరవదన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి జిల్లాకు, మహేశ్వరం నియోజకవర్గానికి నిధులు తీసుకొద్దామన్నారు. గ్రామంలో ఏమైనా అసంపూర్తి పనులు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. ఇక్కడ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ వారు కావచ్చు గానీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందన్నారు. ఈ విషయాన్ని కార్యకర్తలు మరవొద్దన్నారు. త్వరలోనే గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు వేసి పథకాలను అర్హులకు చేరవేసే బాధ్యతలను వాటికి అప్పగిస్తామన్నారు. దీనికి పార్టీ పెద్దలు ప్రణాళిక తయారు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రాఘవేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, సురేశ్, ఓంకార్, పాండు, శేఖర్, యాదయ్య, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



వెంకయ్యనాయుడుకు అభినందనలు తెలుపుతున్న టి.దేవేందర్‌గౌడ్, టి.విజయేందర్‌గౌడ్, వినయేందర్‌గౌడ్

వెంకయ్యనాయుడును కలిసిన దేవేందర్‌గౌడ్

మహేశ్వరం, మార్చి 5: భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడును నగరంలో మంగళవారం మాజీ ఎంపీ టి.దేవేందర్‌గౌడ్, ఆయన తనయులు టి.విజయేందర్‌గౌడ్, వినయేందర్‌గౌడ్ కలిసి శాలువాతో సత్కరించారు. ఎం.వెంకయ్యనాయుడుకు పద్మభూషణ్ అవార్డు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపినట్టు విజయేందర్‌గౌడ్ తెలిపారు.

జీరో బిల్లులు ఎప్పుడొస్తాయ్?



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కృపేశ్, పాల్గొన్న అధికారులు

- ఎప్పటి మాదిరిగానే కరెంటు బిల్లులు వస్తున్నాయ్
- మండల సమావేశంలో సభ్యుల ప్రస్తావన

ఇబ్రహీంపట్నం, మార్చి 5: మార్చి ఒకటి నుంచి పేదలకు జీరో(0) బిల్లులు గాకుండా ఎప్పటిమాదిరిగానే కరెంటు బిల్లులు వచ్చాయని, దీంతో జనం అయోమయంలో ఉన్నారని మంగళవారం ఇబ్రహీంపట్నం మండలపరిషత్ సమావేశంలో సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. తెల్లరేషన్ కార్డులున్నా కొందరికి వందల్లో బిల్లు వచ్చింది వాస్తవమేనని, ముున్ముందు వీటిని సరిచేస్తామని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌రావు సమాధానమిచ్చారు. 200 యూనిట్ల వరకు పేదలు బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఒకవేళ చెల్లించినా వచ్చే బిల్లుల్లో వారి ఖాతాలో జమ చేస్తామని ఆయన చెప్పారు. ఏవైనా అనుమానాలుంటే తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ నంబర్, ప్రజాపాలన దరఖాస్తు రసీదు, కరెంటు కనెక్షన్ నంబర్‌ను విద్యుత్ కార్యాలయంలో అందజేస్తే జీరో బిల్లుకు ఎంటర్ చేస్తామన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ కృపేశ్, వైస్‌ఎంపీపీ వెంకటప్రతాప్‌రెడ్డి అధికారులకు సూచించారు. కరోనాకు ముందు ఇబ్రహీంపట్నం నుంచి పొల్కంపల్లి, అనాజ్‌పూర్ మీదుగా హయత్‌నగర్‌కు బస్సులు నడిచేవని, నిలిపేసిన వాటిని పునరుద్ధరించాలని ఎంపీటీసీ మంగ అధికారులను కోరారు. మండలంలో మొత్తం 37 రేషన్ షాపులకు అనుమతి ఉండగా ప్రస్తుతం ఏడు చోట్ల ఖాళీలున్నాయని, వీటని భర్తీ చేస్తామని డీటీ శ్రీనివాస్ తెలిపారు. ఖాళీచోట్ల ఇన్‌చార్జిలతో బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని ఆయన తెలిపారు. ఉపాధి హామీ పథకంలో ప్రస్తుతం మండలంలో 1,135 మంది కూలీలు పనిచేస్తున్నారని ఏపీవో తిరుపతాచారి తెలిపారు. మండలంలో ఉపాధి కింద ఇప్పటికి రూ.5.12కోట్లు ఖర్చు చేసినట్లు ఆయన వివరించారు.ఆరు వారాలుగా కూలీలకు బిల్లులు రావాల్సి ఉందని ఎన్‌పీసీ క్లియర్ కాగానే వారి ఖాతాల్లో డబ్బు జమ చేస్తామని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ సునీత, ఎంపీడీవో వెంకటమ్మ, డీఆర్‌డీఏ ఏపీడీ సక్రియానాయక్, పంచాయతీ రాజ్ ఏఈ ఇంద్రసేనారెడ్డి, ఇరిగేషన్ ఏఈ రాజ్యలక్ష్మి, ఏపీఎం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా దీవెన' సభను విజయవంతం చేయాలి


విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్ రెడ్డి, యాట నర్సింహ

కడ్తాల్, మార్చి 5: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పాలమూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా దీవెన బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి,ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహులు తెలిపారు. సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. కడ్తాలలో మంగళవారం వారు మాట్లాడుతూ సీఎం బహిరంగ సభకు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే కె.నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున జనసమీకరణ చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం తథ్యం అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబ, నాయకులు వెంకటేశ్, మల్లేశ్‌గౌడ్, శ్రీను, రాజేందర్‌గౌడ్, లక్ష్మయ్య పాల్గొన్నారు. ప్రజా దీవెన సభ విజయవంతం చేయాలని తలకొండపల్లి, ఆమనగల్లు మండల కాంగ్రెస్ అధ్యక్షులు జోకూరు ప్రభాకర్‌రెడ్డి, జగన్ కోరారు.

కేశంపేట: ప్రజా దీవెన సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేష్ పిలుపునిచ్చారు. కేశంపేటలో సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయ్ యాత్ర ముగింపు సభను బుధవారం పాలమూరులోని ఎంవీఎస్ కళాశాల మైదానంలో సభను నిర్వహిస్తున్నట్లు, మండలం నుంచి కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు.

ఫిషరీస్ సొసైటీ అధ్యక్షుడిగా రవీందర్


రవీందర్‌ను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

కేశంపేట, మార్చి 5 : మండల పరిధి ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామ మత్స్య పారిశ్రామిక సంఘాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోటపల్లి రవీందర్, ఉపాధ్యక్షుడు గంటెల శ్రీనివాస్, కార్యదర్శి రావుల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు రావుల యాదయ్య, దండు యాదయ్య, రావుల వేణుగోపాల్, వెంకటయ్య, సురమోని శంకరయ్య, పిట్టల యాదయ్య ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా మత్స్య శాఖ అధికారి రఫీక్‌ఖాన్ వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని మత్స్య సంఘం సభ్యులు సత్కరించారు. పెంటయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

చేవెళ్ల, మార్చి 5: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డాక్టర్ అంబేడ్కర్ జాతీయ అవార్డు గ్రహీత కడమంచి నారాయణదాస్ అన్నారు. మంగళవారం చేవెళ్లలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టుదలతో చదవితే లక్ష్యాన్ని సాధించొచ్చన్నారు. పదిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి, మాజీ ఎంపీపీ రాజ్యలక్ష్మీప్రకాశ్‌గౌడ్, నాయకులు తెలుగు కృష్ణ, వై.కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరిగా చేసుకోవాలి


కేంద్రాన్ని పరిశీలిస్తున్న చంద్రశేఖర్

షాబాద్, మార్చి 5: ప్రతి ఒక్కరూ ఆధార్ అప్‌డేట్ తప్పనిసరిగా చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం హైతాబాద్‌లోని ఆధార్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రతీ సంక్షేమ పథకానికి అధార్ నంబరే ఆధారం అని, ఆధార్‌ను తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, గ్రామస్తులు సురేష్, లోహిత్‌రెడ్డి, చంద్రం, వెంకటయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'స్పోర్ట్స్ కోటాలో పునర్నియామకం చేపట్టాలి'

షాబాద్, మార్చి 5: స్పోర్ట్స్ కోటా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పునర్నియామకం చేపట్టాలని స్పోర్ట్స్ కోటా పంచాయతీ కార్యదర్శులు మంగళవారం పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిప్రతం ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ స్పోర్ట్స్ కోటాలో 98 మంది పంచాయతీ కార్యదర్శులను ఐఏఎస్ కమిటీ ద్వారా ఎంపిక అయి రెండున్నరేళ్లు ఉద్యోగం చేసిన తరువాత ప్రభుత్వం తొలగించిందన్నారు. స్పోర్ట్స్ కోటా కార్యదర్శుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి న్యాయం చేస్తామని మధుసూదన్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, నాయకులు రవి, పంచాయతీ కార్యదర్శులు అశోక్, రాము, సాయికుమార్, వెంకన్న, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ ఫార్మాసిటీ సీఐగా నర్సింహారావు

యాచారం, మార్చి 5 : హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐగా ఎ.నర్సింహారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన హైదరాబాద్ కమిషనరేట్‌లో వెయిటింగ్‌లో ఉన్నారు. పాత సీఐ నాగరాజు ఇటీవల రాచకొండ కమిషనరేట్‌కు బదిలీ కాగా కొత్తగా నర్సింగ్‌రావు వచ్చారు.

ఆమనగల్లు సీఐగా ప్రమోద్‌కుమార్

ఆమనగల్లు, మార్చి 5: ఆమనగల్లు సీఐగా ప్రమోద్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. పోలీసు సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన విజయ్‌కుమార్ ఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యా రు. ఆయన స్థానంలో అల్వాల్ సీఐగా పనిచేసిన ప్రమోద్‌కుమార్ కు ఆమనగల్లుకు ఇచ్చారు. నూతన సీఐని ఎస్ఐ బాల్‌రామ్‌నాయక్ మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

ఒత్తిళ్లను అధిగమిస్తేనే ఉత్తమ ఫలితాలు

ఆమనగల్లు, మార్చి 5: విద్యార్థులు ఒత్తిళ్లను అధిగమించి ముందుకు సాగితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎన్ఎస్‌యూ మండల అధ్యక్షుడు ఫరీద్ అన్నారు. పదిలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి జిల్లాలో అగ్రభాగాన నిలువాలని కోరారు. ఆమనగల్లులోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల పదో తరగతి విద్యార్థినులకు మంగళవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ చేశారు. ఎస్వో పద్మజ్యోతి, ఫరీద్ ప్యాడ్లు, పెన్నుల పంపిణీ చేశారు. విద్యతోనే ప్రగతి సాధ్యం అన్నారు. పదో తరగతిలో 10జీపీఏ సాధించే వారికి ఎన్ఎస్‌యూఐ నుంచి రూ.5వేల చొప్పున ప్రోత్సాహకాన్ని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, అబ్దుల్, రాహుల్, పవన్, గణేశ్, టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

టీడీపీ వాణిజ్య సెల్ కార్యదర్శిగా సత్యనారాయణ

ఆమనగల్లు, మార్చి 5: టీడీపీ వాణిజ్య సెల్ రాష్ట్ర కార్యదర్శిగా ఆమనగల్లు పట్టణానికి చెందిన కండె సత్యనారాయణ నియమితులయ్యారు. మంగళవారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో రాష్ట్ర వాణిజ్య సెల్ అధ్యక్షుడు దుర్గారావు ఈ మేరకు కండె సత్యంకు నియామకపత్రం అందజేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి సత్యనారాయణ టీడీపీలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. గతంలో టీడీపీ మండల అధ్యక్షునిగా, ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌గా, వాణిజ్య సెల్ కార్యదర్శిగా సేవలందించారు. ప్రజా సమస్యలపై పోరాటాలు సాగించారు. పార్టీకి అందించిన సేవలకు గుర్తింపుగా సత్యనారాయణకు రాష్ట్ర వాణిజ్య సెల్‌లో చోటు కల్పించారు. టీడీపీ రాష్ట్ర వాణిజ్య సెల్ కార్యదర్శిగా నియమితులైన సత్యనారాయణను ఆ పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అండెకార్ యాదిలాల్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కోశాధికారి నర్సింహ అభినందించి సత్కరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మంచాల, మార్చి 5: మండల పరిధి నోముల ప్రాథమికోన్నత పాఠశాల 1988-89బ్యాచ్ ఏడో తరగతి విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. పట్టణంలోని వినోద కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన ఈ సమ్మేళనంలో పూర్వవిద్యార్థుంతా హాజరై పాతజ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి టీచర్లు గోవర్ధన్‌చారి, బల్‌రాం, బుగ్గయ్యలను సత్కరించారు. సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జగన్, టి.సుదర్శన్‌రెడ్డి, టి.రాంరెడ్డి, జంగయ్య, పి.కిషన్, సీహెచ్.శ్రీనివాస్‌రెడ్డి, డి.భాస్కర్ పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న నోముల యూపీఎస్ పూర్వ విద్యార్థులు

'ధరణి' దరఖాస్తుల పరిశీలన


కొడిచర్లలో దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్

కొత్తూర్, మార్చి 5: మండలంలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిశీలన మంగళవారం ప్రారంభమైంది. కొడిచర్ల, ఖాజిగూడ తండాల్లో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి దరఖాస్తులను పరిశీలించారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ల ఆధ్వర్యంలో రెండు టీంలుగా విడిపోయి ఆయా గ్రామాల్లో దరఖాస్తులను పరిశీలించారు. పరిశీలించిన దరఖాస్తులను త్వరలో ఉన్నతాధికారులకు పంపిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

కేశంపేట: మండలంలో ఇప్పటి వరకు 585 ధరణి దరఖాస్తులను పరిశీలించామని తహసీల్దార్ మీర్ ఆజం అలీ తెలిపారు. మంగళవారం అల్వాలలో 32, పాపిరెడ్డిగూడలో 47, తొమ్మిది రేకులలో 7, ఇప్పలపల్లిలో 15 దరఖాస్తులను పరిశీలించామన్నారు.

చంద్రబాబును కలిసిన యాదిలాల్

ఆమనగల్లు, మార్చి 5: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మంగళవారం టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి, కల్వకుర్తి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అండెకార్ యాదిలాల్ కలిశారు. హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గంలో టీడీపీ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం


షాద్‌నగర్ రూరల్: శివ పార్వతుల కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్ దంపతులు


తలకొండపల్లి: పడిపూజలో పాల్గొన్న స్వాములు

షాద్‌నగర్ రూరల్, మార్చి 5 : ఫరూఖ్‌నగర్ మండలం రామేశ్వరం రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దంపతులు హాజరై పూజలు చేశారు. అంతకు ముందు మాజీ సర్పంచ్‌ల సమకారంతో నిర్మించిన ఆర్చ్‌ని ఆయన ప్రారంభించారు. దాత జగన్‌నాయక్ కోనేరు వద్ద ఏర్పాటు చేసిన హై మాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఎమ్మెల్యే దంపతులకు ఈవో శివకుమార్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ఫరూఖ్‌నగర్, కేశంపేట జడ్పీటీసీలు వెంకట్‌రాంరెడ్డి, విశాల శ్రావన్‌రెడ్డి, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అరుణ, అంజయ్యగౌడ్, ఆలయ చైర్మన్ రవీందర్‌రావు, అర్చకులు ప్రహ్లాదచార్యులు పాల్గొన్నారు.

తలకొండపల్లి: వెల్జాల వేద్రాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఐదు రోజులు ఉత్సవాలు నిర్వహిస్తారు. తలకొండపల్లి, మిడ్జిల్, కేశంపేట, ఊర్కొండపేట్, ఆమనగల్లు, కడ్తాల మండలాల నుంచి భక్తులు తరలి రానున్నారు. తొలి రోజు సుప్రభాత సేవ, స్వామివారికి మేలుకొలుపు పాడారు. ఉత్సవ విగ్రహాలను అలంకరించి ప్రధాన ధర్మకకర్త గూడ యాదగిరి నృసింహశర్మ, శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంబాజీ, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, ప్యాక్స్ వైస్‌చైర్మన్ కె.రవి, నాయకులు సీఎల్ సంగీత, నరేందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, అశోక్, తిరుపతిరెడ్డి, విజయ్‌కుమార్, నర్సింహ, శ్రీరామ్, సుధాకర్, భాస్కర్, మహేశ్, రాజేందర్‌రెడ్డి, లింగం పాల్గొన్నారు. అలాగే మండల పరిధి చీపునుంతలలో ద్వాదశ జ్యోతిర్లింగ పడిపూజను నిర్వహించారు. గురుస్వామి సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో పూజలో భక్తులు, శివస్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు సీఎల్. శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పూజల అనంతరం శివస్వాములు శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. కార్యక్రమాల నిర్వహణకు శ్రీనివాస్‌యాదవ్ రూ.5వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో బాలకుమార్‌గౌడ్, జంగయ్య, నారాయణ, రమేశ్, బాలకృష్ణ, మహేందర్, మహేశ్, దినేశ్, శివ, అభివన్‌గౌడ్, అయోధ్య, కృష్ణయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

మొయినాబాద్: శివ నామస్మరణతో మండల పరిధి చాకలిగూడ మార్మోగింది. గ్రామంలో శివప్ప జ్యోతిర్లింగ పడిపూజ కార్యక్రమాన్ని కేతిరెడ్డిపల్లి ఎంపీటీసీ సభ్యురాలు రెడ్డమోని అర్చన ఆధ్వర్యంలో నిర్వహించారు. రాచలింగం గురుస్వామి ఆధ్వర్యంలో పూజలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించామని, ఇలాంటి కార్యక్రమాలతో ప్రశాంతత నెలకొంటుందని ఎంపీటీసీ అన్నారు. స్వాములు శివుడికి అభిషేకాలు, పూజలు చేశారు. భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల శివస్వాములు, సన్నిధానం స్వాములు రవిగురుస్వామి, కన్నె స్వాములు హర్షవర్ధన్, అఖిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.


చాకలిగూడలో పడిపూజ చేస్తున్న భక్తులు

'పల్స్ పోలియో'ను విజయవంతంగా పూర్తి చేశాం


ఆలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతున్న చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్

చేవెళ్ల/షాబాద్/షాద్‌నగర్ రూరల్, మార్చి 5 : చేవెళ్ల డివిజన్‌లో మండలాల్లో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్ అన్నారు. మంగళవారం చేవెళ్లలో మాట్లాడుతూ.. ఈ నెల 3 నుంచి 5వ తేది వరకు 0-5సంవత్సరాల లోపు పిల్లలకు పల్స్‌పోలియో చుక్కల మందు వేశామన్నారు చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల ఆరోగ్య కేంద్రాల పరిధి గ్రామాల చిన్నారుల కు పోలియో చుక్కలు వేశామన్నారు. అందరి సహకరంతో వంద శాతం పల్స్ పోలియోను విజయవంతం చేశామన్నారు. డాక్టర్ దామోదర్ ఆధ్వర్యంలో షాబాద్ మండలంలో పల్స్ పోలియోలో భాగంగా ఇంటింటి సర్వేపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాస్, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ భగత్, సీహెచ్‌వో గోపాల్‌రెడ్డి, సిబ్బంది శంకర్, గోపాల్ ఉన్నారు. చిన్నారులకు చుక్కల మందు వేయడంపై నిర్లక్ష్యం చేయవద్దని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. ఫరూక్‌నగర్ మండలం చించోడు ఆరోగ్య కేంద్రం, కిషన్‌నగర్ సబ్ సెంటర్‌ను ఆయన తనిఖీ చేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని పరిశీలించారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ చుక్కల మందు తప్పక వేయించాలన్నారు. కిషన్‌నగర్ శివారు ఇటుకల బట్టీల వద్దకు వెళ్లి చిన్నారులను ఆయన పలకరించారు. అనంతరం పీహెచ్‌సీ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయలక్ష్మి, డాక్టర్ స్రవంతి, జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ నరహరి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు ఉన్నారు.


పీహెచ్‌సీ రికార్డులను పరిశీలిస్తున్న వెంకటేశ్వర్‌రావు

రేషన్ సరఫరాలో అక్రమాలకు పాల్పడితే చర్యలు


రేషన్ షాప్‌ను సీజ్ చేస్తున్న డీటీ రఘునందన్

ఆమనగల్లు, మార్చి 5: రేషన్ బియ్యం పంపిణీలో డీలర్లు అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు తప్పవని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్ హెచ్చరించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఆమనగల్లులో మంగళవారం రేషన్ దుకాణాలను రాష్ట్ర విజిలెన్స్ బృందంతో కలిసి తనిఖీ చేశారు. పరిమాణంలో వ్యత్యాసం ఉన్న కారణంగా 1592001 దుకాణాన్ని సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ డీలర్లు అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. సబ్సిడీ బియ్యం సకాలంలో, సక్రమంగా వినియోగదారులకు పంపిణీ చేయాలన్నారు. దుకాణాల నిర్వహణలో అలసత్వం, ఉదాసీనత ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు. కొందరు డీలర్లు రేషన్ బియ్యాన్ని మిల్లర్లకు, కోళ్ల ఫారాలకు అమ్ముతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అయా డీలర్లపై నిఘా ఏర్పాటు చేసినట్లు రఘునందన్ పేర్కొన్నారు.

జీపీ కార్మికుడికి ప్రభుత్వ సాయం

మంచాల, మార్చి 5: మండల పరిధి లోయపల్లికి చెందిన పంచాయతీ కార్మికుడు రమేష్ వీధి లైట్లు వేస్తూ ఇటీవల ప్రమాదవశాత్తు స్తంభంపై నుంచి పడి గాయపడ్డాడు. చికిత్స అనంతరం అతడు ఇంటికి చేరుకున్నాడు. మంగళవారం తహసీల్దార్ ప్రసాద్‌రావు లోయపల్లికి చేరుకుని రమేష్‌ను పరామర్శించారు. ప్రభుత్వ తాత్కాలిక సాయం కింద రూ.15వేలు, పంచాయతీ నుంచి రూ.10వేలు, తహసీల్దార్ వ్యక్తిగతంగా రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో పీఎస్ శోభ, సీఐటీయూ నాయకుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు తల్లిదండ్రులతో గౌరవంగా మెలగాలి


గూడూరులో విద్యార్థులకు డిక్షనరీలను పంపిణీ చేస్తున్న ఆంజనేయులు

కందుకూరు, మార్చి 5 : విద్యార్థులు తల్లిదండ్రుల పట్ల గౌరవంతో మెలగాలని, పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించాలని హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.ఆంజనేయులు కోరారు. మంగళవారం గూడూరు పాఠశాల 9, 10వ తరగతుల విద్యార్థులకు డిక్షనరీలను అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదవితేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. నిరుపేదల విద్యార్థులకు తమ సంస్థ ద్వారా సేవలు అందజేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే 40మంది విద్యార్థులకు డిక్షనరీలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర కోశాధికారి వెంకటేశ్వర్లుగుప్తా, కార్యదర్శి విజయ్, జిల్లా కార్యదర్శి మల్లేష్, నాయకులు రవి, భరత్, హెచ్ఎం కిషన్, ఉపాధ్యాయులు అయ్యాబ్, రోనాలి, గ్రామస్తుడు కిషన్ పాల్గొన్నారు. అలాగే కందుకూరు మండల కొత్తగూడలో గల కస్తూర్బాగాంధీ బధిరుల పాఠశాలలో నేదునూరు మాజీ వార్డు సభ్యులు నర్సింహ రూ.10వేల డిక్షనరీలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు విద్యలో రాణించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.భార్గవి, నాయకులు మాధవరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు


ముస్తాబవుతున్న నందివనపర్తి నందీశ్వరాలయం

యాచారం, మార్చి 5 : నందివనపర్తిలోని నందీశ్వరాలయం, శివాలయం, గున్‌గల్, గడ్డమల్లామగూడ, చిన్నతూండ్ల గ్రామాల్లోని శివాలయాలు మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. నిర్వాహకులు ఆలయాలకు రంగులు వేస్తున్నారు. నందివనపర్తి జాతర జరుగుతుంది. ఈ నెల 8న ఉదయం అఖండదీపారాదనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. శివరాత్రి రోజున జాగారం సందర్భంగా వాలీబాల్, కబడ్డీ తదితర ఆటల పోటీలు నిర్వహిస్తారు.

తలకొండపల్లి: చెన్నారం సమీపంలోని మల్లప్పగుట్టపై బుధవారం నుంచి 10వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు పరిశీలించారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎక్కడ ఇబ్బందులు కలుగకుండ ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. బందోబస్తు ఏర్పాట్లను కడ్తాల సీఐ శివప్రసాద్, తలకొండపల్లి, కడ్తాల ఎస్ఐలు శ్రీకాంత్, వరప్రసాద్ పరిశీలించారు. కల్యాణం, బోనాల సందర్భంగా వేలాది భక్తుల రాక నేపథ్యంలో తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, పెంటారెడ్డి, దామోదర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, అశోక్, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు: శివరాత్రిని పురస్కరించుకొని ఆమనగల్లులోని పాత శివాలయంలో 8న శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తామని అర్చకులు శివకుమార్, అక్షయ్‌కుమార్ తెలిపారు. శివాలయంలో శివరాత్రి ఉత్సవాలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కోట్ల వెంకటేశ్, లక్ష్మణ్, తిరుపతయ్య, వెంకటేశ్, భాస్కర్, నవీన్, గాజుల రమేశ్, రాఘవేందర్, సుమన్, సాయి, చత్రు, సృజన, భాగ్యమ్మ, విజయ, తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ శివ ప్రసాద్, ఎస్ఐలు

సంక్షిప్తంగా..

● **మహేశ్వరం:** నాగిరెడ్డిపల్లెలోని సర్వే నంబర్ 180లో 40 మంది దళిత రైతుల లావణిపట్టా భూములను కొందరు రియల్ వ్యాపారులు కాజేయాలని చూస్తున్నారని గ్రామ రైతులు, మాజీ సర్పంచ్ మనోహర్ మంగళవారం తహసీల్దార్ విజయలక్ష్మికి ఫిర్యాదు చేశారు. తాతల కాలం నుంచి ఈ భూములను సాగు చేసుకుంటున్నామని, ఇప్పుడు ఈ భూములను రియల్ వ్యాపారులు ఖాళీ చేయాలని రైతులను బెదిరిస్తున్నారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను కోరామన్నారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో రైతులు సామయ్య, ఎల్లయ్య, యాదయ్య, జంగమ్మ, నర్సమ్మ ఉన్నారు.

● **మాడ్గుల:** మాడ్గులలోని పెద్దమాడ్గుల సమీపాన ఉన్న శివాలయంలో ఈ నెల 8,9 తేదీల్లో నిర్వహించే శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొనాలని కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డికి ఆలయ కమిటీ నాయకులు మోహన్‌రెడ్డి, భూపతిరెడ్డి, కాట్ల యాదయ్య గౌడ్, శ్రావణ్‌రెడ్డి, వెంకట్‌రాం రెడి ఆహ్వాన పత్రిక అందచేశారు.

● **శంషాబాద్:** శంషాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో వెస్ట్ బెంగాల్ సందేశ్ కాళీ ఘటన నిందితుల దిష్టిబొమ్మలను ఏబీవీపీ విద్యార్థులు దహనం చేశారు. ఏబీపీ మండల కన్వీనర్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ స్త్రీలపై అఘాయిత్యాలను ప్రజలందరూ ఖండించాలన్నారు. పశ్చిమబెంగాళ్ ముఖ్యమంత్రి నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రదీప్, అఖిల్, మహిష్, భార్గవి, అనూష రాజేశ్వరి, సంధ్య చరన్, తిరుపతి, దినేష్, నవీన్, పాల్గొన్నారు.

● **నందిగామ:** నందిగామ అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ఎంపీటీసీ చంద్రపాల్‌రెడ్డి అన్నారు. నందిగామలోని మొదటి వార్డులో ఎంపీటీసీ నిధులు 4లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న అంతర్గత మురుగు నీటి నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, అంజుయాదవ్, ప్రవీణ్, రవిందర్‌రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

● **కడ్తాల్:** దాతృత్వం, సేవా భావం సమాజంలో వ్యక్తి ప్రతిష్ఠకు దోహద పడుతాయని ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ వి.దామోదర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ పేర్కొన్నారు. కడ్తాలలో లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డి 72వ జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ ద్వారా చెన్నకిషన్‌రెడ్డి అందిస్తున్న సేవలను పలువురు కొనియాడారు. అదే విధంగా చెన్నకిషన్‌రెడ్డి జన్మదిన వేడుకలు కడ్తాల, ఆమనగల్లు పట్టణాల్లో అట్టహాసంగా నిర్వహించారు.

● **కందుకూరు:** యాదవులు విద్య , వ్యాపారం, రాజకీయ రంగాల్లో రాణించాలని యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్ కోరారు. సంఘం మండల అధ్యక్షుడు పసుపుల పర్వతాలు ఆధ్వర్యంలో సంఘం నూతన క్యాలెండరును సీఐ మమక్బుల్ జానీతో కలిసి ఆవిష్కరించారు. సంఘం సభ్యులు సంఘటితంగా ఉంటూ, విద్యాపరమైన, వృత్తిపరమైన వాటిల్లో తనమవంతు సహాయ సహకారాలను అందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రావణ్‌కుమార్. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణయాదవ్, నాయకులు లక్ష్మయ్య, సుధాకర్, బాల్‌రాజ్, రాములుయాదవ్, మైసయ్య, రామకృష్ణ, జనార్దన్, శ్రీనివాస్, బిక్షపతి, రాజు, నాగేష్, మల్లేష్, హహనుమంతు, ఆంజనేయులు, శ్రీశైలం, కుమార్ పాల్గొన్నారు.

● **కడ్తాల్:** రావిచేడ్, కడ్తాల, ముద్విన్, చల్లంపల్లి, కర్కల్ పహాడ్ గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఆవులు, గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశువైద్య సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో టీకాలు వేశారు. కడ్తాల పశువైద్య అధికారి భానునాయక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదు గ్రామాల్లో 648ఆవులు, 22గేదెలకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రాజేశ్, మల్లేశ్, వెంకటయ్య, రమేశ్, అఫ్సర్, బుర్హాన్, చంద్రశేఖర్, సంజీవ, వాల్యానాయక్, గోపాలమిత్రలు శ్రీశైలం, నవీన్ పాల్గొన్నారు.

● **మహేశ్వరం:** ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలులో ప్రభుత్వం జిల్లాల కలెక్టర్లతో ఏర్పాటు చేసిన కమిటీ పూర్తిగా విఫలమైందని రిటైర్డ్ తహసీల్దార్ అశోక్‌కుమార్ అన్నారు. తుక్కుగూడలోని అంబేడ్కర్ భవనంలో సిటిజన్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సమావేశం జరిగింది.

క్రైం కార్నర్

ఇసుక ట్రాక్టర్ సీజ్

మాడ్గుల, మార్చి 5: మండలంలోని ఇర్విన్ పరిధి గంగ్యాగాని తండా వాగు నుంచి మంగళవారం ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండా పోలీసులు పట్టుకున్నారు. ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ జోజిరెడ్డిదిగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ఉపేందర్ తెలిపారు.

యువకుడి వద్ద గంజాయి పట్టివేత

ఆమనగల్లు, మార్చి 5: ఆమనగల్లు పట్టణంలోని బస్టాండ్ కూడలిలో మంగళవారం రాత్రి గంజాయి పట్టుబడింది. హైదరాబాద్ నుంచి వచ్చిన ఓ యువకుడు బైక్‌పై కల్వకుర్తి వైపు వెళ్తున్నాడు. పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అతడి వద్ద గంజాయి లభ్యమైనట్టు తెలిసింది. గంజాయితో పాటు ఇతర మాదక ద్రవ్యం కూడా పట్టుబడినట్టు సమాచారం. కాగా పట్టుబడిన గంజాయి ఎంత అనేది పోలీసులు నిర్ధారించాల్సి ఉంది.